

# అద్దం అబద్ధమాడింది

సీతాపతి మెడక్కుతూ మెట్లు వంకర తిరిగినచోట ఆగాడు.

అక్కడనుంచి అతనికి కనబడ్డ దృశ్యం అతన్ని అడుగు ముందుకి వెయ్యనివ్వలేదు.

వెంటనే మొహం తిప్పుకున్నాడు. సీతాపతి కిందకి దిగిపోదామన్నట్టుగా మనిషి తిరిగాడు.

రవణమ్మా, అప్పారావూ ముందు విడివడ్డారు. ఒకరి చేతులోంచి వొకరు. తర్వాత ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

నవ్వుకుందామని యిద్దరికీ అనిపించింది. కాని ఒకరూ నవ్వలేక పోయారు. ఒక్క క్షణం ఇద్దరికీ ఏమీ తోచక బెరుగ్గా చూసుకున్నారు. మాటా రాలేదు, ఎవరికీను.

ఆఖరికి రమణమ్మే ముందు మాట్లాడింది.

"ఏం కావాలి నాన్నా? రా!—" అంటూ చకచకా తండ్రి నుంచున్నవేపు వెళ్ళింది.

"ఏం లేదులే అమ్మా"— అని అప్పటికప్పుడే ఐదారు మెట్లు దిగిపోయాడు సీతాపతి.

సీతాపతి వెళ్ళడం గమనించిన అప్పారావు మెట్లు చివరదాకా వొచ్చేసి "వెళ్ళి కనుక్కో ఏం కావాలో పాపం!" అన్నాడు.

"అబ్బా, నే వెళ్ళను" అంది రమణమ్మ సిగ్గుతో.

"ఏడిసినట్టుంది తెలివి. ఏమిటా సిగ్గు! - ఇంతలోనే ఏం కొంప మునిగింది? వెళ్ళు వెళ్ళు -"

"అయినా మీరు మరీనండి - పట్టపగలు అరుబైట. చీ-" అని సిగ్గుపడింది రమణమ్మ.

అప్పారావు శృంగారంగా నవ్వాడు. తల గోక్కున్నట్లు నటించి ఓహో—పగలుకదూ, మరిచిపోయాను! సరేలే చీకటిపడ్డాకే వస్తాను" అని చిరునవ్వుతో చక చకా మెట్లు దిగి వెళ్ళాడు.

సీతాపతి మెట్లుగది అవతల స్తంభందగ్గిర ఏమీ తోచక నిలబడ్డాడు.

అప్పారావు రావడం, విసురుగా కింది గదిలోకి వెళ్ళి తల దువ్వుకోడం, చొక్కా మార్చుకోడం, చెప్పులు తొడుక్కుని బైటికి వెళ్ళిపోడం, క్రీగంట గమనిస్తూ నించున్నాడు సీతాపతి.

"ఇందులో ఎవరి తప్పు మాత్రం ఏముంది?" అనుకున్నాడు.

లేదు. ఇప్పుడు జరిగిందాట్లో ఎవరి తప్పూ లేదు.

రెండేళ్ళ గుడ్డుని తన చేతుల్లో వొదిలి — ఆ నాడు నరసమ్మ కన్ను మూసినప్పుడే జరిగిపోయింది తప్పు...

లేని పోని బాధలు ఊహించుకొని, పచ్చని జీవితమూ, వెచ్చని వయసూ వొదిలి, రెండేళ్ళ పాపని అక్కగారు పార్వతమ్మ చేతుల్లో వొదిలి కొత్త బాధలు సృష్టించుకోకుండా, మిలట్రీలో చేరిపోకుండా ఆనాడు సరిదిద్దుకోవలసిన తప్పు అది.

ఇప్పుడనుకుంటే మాత్రం ఏం లాభం ?

పన్నెండేళ్ళ సర్వీసు పూర్తి చేసుకొని, సందిటినిండా డబ్బూ ఆర్జించుకొని, తిరిగొచ్చిన వేళకి—

రవణమ్మ గుమ్మటంలా ఎదిగిపోయింది. ప్రభలా అలంకరించుకొని గుమ్మంలోనే ఎదురొస్తే.

చూసీచూడగానే ఇది వాళ్ళమ్మా, ఇదేనా—అని ఓ లిప్త కంగారు పడ్డాడు.

ఎదిగొచ్చిన అమ్మాయినిచూస్తే కలిగిన ఆనందంతోబాటు ఎదురొచ్చిన సమస్యకూడా స్ఫురించి బెదురూ పడ్డాడు.

అయినా అతనికేం లేదా, పోదా ?

ఉన్నఊళ్లో సొంత యిల్లూ, మొగుడు లేకపోబట్టి కాబోలు పదిమంది మొగాళ్ళ పెట్టుగా యిల్లూ పొలమూ దిద్దుకొస్తూ ఏడాదేడాదీ తమ్ముడు పంపిన డబ్బూ పొలం మీది డబ్బూ వడ్డీకే వేస్తూ లోటే లోటుగా వొప్పచెప్పిన విధవక్కగారూ.

వీటన్నిటికీ తోడు ప్రాజ్ఞతతో జాగ్రతతో నిలవచేసి తనతో తెచ్చుకున్న ముల్లె—

చుట్టుపట్ల ఈ రేడు వూళ్ళల్లో ఆ రేడు లోకాల్లో 'సమానంలో యింతకంటె మెరుగులే' దనిపించే సంబంధం తెచ్చి కట్టేడు. కూతురికి ఏడాది గిర్రున తిరిగేపరికి.

ఎవరో అనడం, ముఖ్యప్రీతి కనవసరం; సీతాపతే అనుకున్నాడు తన మామగారు నరసమ్మకి చెయ్యని న్యాయం తను రవణమ్మకి చెయ్యగలిగాడని, రవణమ్మా అప్పారావూ ఈడేకాకుండా జోడున్నూ కావడం వాళ్ళిద్దరూ ఒకళ్ళని చూసుకుని ఒకళ్ళు తృప్తిపడిపోడంలో ఆకలీ, వేళా కూడా మరిచిపోడం చూసుగుని –

'ఏ పిల్లకి ఏ తండ్రి చేశా డిలాగా ?' అని గర్వమూ పడ్డాడు సీతాపతి. 'కార్య'మైన తరవాత తొలి సంక్రాంతిది.

'అచ్చటా, ముచ్చటా అచ్చ కేం జరిగేను—కోడల్ని తీసుకుని తమరే మా యింటికి దయచెయ్యండి. మీ పండగ సంబరం మేమూ పంచుకుంటాం అన్నగారూ !' అని వియ్యపురాలు పొడిస్తే—

'మాకేం లోటు ? డబ్బులేదనా, చేసేవాళ్ళు లేరనా ? అ మాట కొస్తే రవణమ్మకి పార్వతమ్మ చేసినట్టు ఏ పిల్లకి ఏ తల్లి చేసింది' అనుకొని ఆక్కనూ పంతమూ పట్టి.

అల్లుణ్ణి తీసుకొచ్చాడు...

ఎక్కడా ఏదీ బెడిసికొట్టలేదు.

బెడిసి కొట్టకపోడవేం కాదు — శ్వశురగృహం భారపికి కష్టంగా తోచడ మెందుకో అప్పారావు కర్థమవలేదు; జామాతా దశమ గ్రహః అన్న నుడిలో ముడి విడనూలేదు సీతాపతికి ఈ రెణ్ణాల్ల బట్టీనూ.

ఇప్పుడు ఈ సాయంకాలం ఓ దృష్టితో చూడ్డం అలవాటైన కళ్ళకి ఓరకం దృశ్యం కనబడేసరికి తప్పొప్పుల ప్రసక్తి వొచ్చేసి జరుగుతున్నదంతా జరిగిందాంతో తూకం వడుతోంది.

ఏది ఓగ్గో ఏది మొగ్గో తెలీడం లేదు.

కూతుర్నీ అల్లుణ్ణీ చూసుకుంటూ గడిపేస్తున్న సీతాపతికి—

'ఈ సుఖం వెనుక వో సమస్య వుం'దనీ, 'ఏ వయస్సుకైనా ఆ వయసు చెలిమే ఎక్కు అవసర' మనీ.

మబ్బుతెర విడిపోయిన ఎండలాగ.

ఎవరో స్పష్టమైన భాషతో చెప్పేస్తున్నట్టు.

తీక్షణంగా. కష్టంగా తోచసాగింది!

ఎందుకా ?

సీతాపతి వయస్సు అరవై కాదు ... యాభైరాలేదు ... నల భయ్యా వెళ్ళలేదు ... మచ్చటగా ముప్ఫయి వెళ్ళి అందంగా అరు దాటాయి.

ఆ తరంప్రారంభంలో—

ఇలాంటి పొంగే కాబోలు అదీను—

లక్షణాలు వేరయినా లక్ష్యం వొకటేగనక రవణమ్మ భూమ్మీద పడేసరికి నరసమ్మకి పదిహేడూ, సీతాపతి కిరవై, పెళ్ళై ఏడాదీ!

పట్టుమని పదినిముషాలపాటు ఇరుగు పొరుగు వాళ్ళ పాపల్నయినా ఎత్తుకోడం నేర్చుకోని కుర్రాళ్ళకి—

వాళ్ళకీ వో పాప

ఏడిస్తే ఎత్తుకోడానికీ, ఏడవకపోతే ఎత్తుకోడానికి ఓ పాప—

వొచ్చేసిందంటే—

ఆశ్చర్యానికి మించి సిగ్గే వేసింది.

ఇప్పుడు మళ్ళీ అలాటి సిగ్గే వేస్తోంది.

అల్లుడు అలా వెళ్ళీ వెళ్ళగానే గాలితెరల్లాంటి ఆలోచల్ని తోసేసుకుంటూ మేడెక్కాడు సీతాపతి. అలమార్లో అలవాటైన పుస్తకాన్నే పరధ్యానంగా వెతుకుతూ వుంటే కేవలం చూడ్డానికొచ్చి అక్కడ నిలబడ్డ రవణమ్మని చూస్తే అలాటి సిగ్గే వేస్తోంది.

ఇంతకు ముందే ఆ పుస్తకం పట్టుకొని ఎటో వెళ్ళి వుంటే అల్లుడు పాపం ఈ అందమైన సాయంకాలం ఇంటిదగ్గిర ఈ దాబా మీద గడిపేవాడు గదా అనిపించింది. అనాలనిపించింది— సిగ్గువేశ అనలేకపోయాడు.

వినురుగా మెట్లు దిగి వీధివేపు వెళుతూఉంటే—

హాల్లో అద్దం "హల్లో" అంటూ పలకరించింది.

మొహం చూసుకో అని మోహాతరిచింది.

అద్దంలో మొహం చూసి సీతాపతి మొహం ముడుచుకు పోయింది. ఛీ, ఇదేమి టీ మొహం?

ఇలా వుందేమిటి, నలిగిన పట్టుబట్టలాగ, ఎండిన అప్పడం లాగ, వాడిపోయిన జీడిపండులాగ?

ఇన్ని మడతలు, ఇన్ని ముడతలు. ఇన్ని పగుళ్ళూ ఉన్నా యేమిటి ఈ మొహంలో?

ఇదెవరిదో తప్పుచేసినవాడి మొహం. ముసిలాడి మొహం!

తనే, తప్పుచేసినవాడు... తనే ముసిలాడు...


తనే; తనే: తనే:

తనదే ఆ మొహం...తనే తప్పు చేసినవాడు...ఛీ!

పొద్దుపోయింది.

అల్లుడు ఇంటికెళ్ళి వుంటాడు. తన కోసం చూడకుండా భోంచేసి 'వాళ్ళు' మేడెక్కి పడుకున్నా రనిపిస్తే బాగుండు నని తోస్తోంది సీతాపతికి. ఎందుకో అతనికి తెలియడంలేదు.

అల్లుడు మర్యాదిచ్చి మర్యాద పుచ్చుకునే రకం. తను రాకుండా భోజనం చెయ్యడు చేసిన ఆలస్యానికి నొచ్చుకుంటూ చకచకా అడుగులెయ్య సాగాడు.



చెరువుకొమ్ము వంత దగ్గర పలకరింపు విని ఒక్కక్షణం 'వన్నెలా' అని వస్తాయించి ఆగాడు.

'ఈవేఁర్నేనండి బాబుగారండి. ఇల్లా వొస్తున్నారెక్కణ్ణుంచండి?'

'ఎవరే అది? బుచ్చి!'

'మరేనండి బాబుగారు...కొత్త మోపెత్తి పెదకారండి? చాలాసేపు నిలబడి పోయానండి. ఎవరూ వినలేదండి'

పుల్లల మోపు ముందుంచుకొని ఎత్తేవాళ్ళు లేక నుంచున్నది బుచ్చి. ఆమెని గురించి వొక్క మాటలో చెప్పాలంటే 'గత వైభవ చిహ్నం.' బుచ్చి ఆ వూరికి మత్స్యగంధి ఇంటా బయటానూ.

అయితేనేం. ఆమె చరిత్ర వ్రాయాలంటే మళ్ళీ ఏ వ్యాస మహర్షో రావలిసిందే. అయితే యీ మాట భాగవతం రచించే శృంగార ఘంటంతో ఒస్తే మంచిది.

ఆమె లీలలు ఇంటింటా శిలా శాసనాల్లా వెలిసి వున్నాయి.

రసికావతంసులై యిల్లాళ్ళ నేలుతున్న ఊరి చాతుర్వర్ణ్యమూ కూడా వొకనాడు బుచ్చి శిక్షణ పొందాలని ఉవ్విళ్ళూరిన వాళ్ళే... ఆమె దగ్గిర గొప్పా బీదా లేవు...

'ఉండిపో' మని ఎందరు సుఖవంతంగా రసవంతంగా బల వంతం చేసినా ఒప్పుకోలేదు... ఊరిచివర ధాన్యంమిల్లు పెట్టడానికి ఆ రాచవారు ఒచ్చేవరకూనూ.

మిల్లు వుందిగాని 'వారు' లేరిప్పుడు...

ఎవరున్నా ఎవర్లేక పోయినా—ఏమున్నా ఏం లేకపోయినా—

బుచ్చినెవరూ మరిచిపోలేరు.

ఇప్పటికైనా దాని బింకమూ, పొంకమూ, పెంకెతనమూ—టుంకంలాటి మంకుతనాన్నైనా సరే రంకెలేయిస్తుం దనడానికి—దేహం వున్నవాడెవడికీ సందేహం కలగదు.

మోమోట పడ్డా మోపెత్తి పెట్టాడు సీతాపతి.

"మీ నాన్న బావున్నాట్టే ?"

"ఏం బాగు సామీ—'సావా సావడు సావా నివ్వ' దన్నట్టుంది ఆడిపని... ఇంకా ఆడి సేపల దుకాణం, మిల్లు దొరగారూ ఉన్నారనే నండి ఆడి ఒెమ... అత్తుమానం తే తే అంటాడండి—ఏంటి తెచ్చేది.!"

మిల్లు పూడ్చడానికీ, అక్కడ నీళ్ళూ అవీ ఉంచడానికి ఇలా ఏదో పేరుచెప్పి రాజుగారు బుచ్చికి పబ్లీకున నెలకి యింతా అని ముట్ట జెప్పేవాడు. ఆయన పోగానే ఆ ఉద్యోగంలో మర్యాద పోయింది. కొన్నాళ్ళకి ఆ ఉద్యోగమూ ఎవరికి చెందాలో వారికి చెండింది.

ప్రజాస్వామ్యం వొచ్చాక రాజాదరణ తగ్గిపోయిన కళలా బుచ్చి మూలపడి "పువ్వులమ్మిన ఊళ్లోనే పుడకలమ్ము కుంటోంది."

కదిపితే కందిరీగల పుట్ట—అని తెలిసినవాడు గనక సీతాపతి ఆ పలకరింపుతోనే చాలించుకొని మరేమీ కదపకుండానే నడక సాగించాడు.

ఎవరికెంత హీనమైన కథైనా బుచ్చి తన కథకి తనే నాయకు రాలు గనక—

మాట్లాడనని భీష్మించుకున్న సీతాపతిచేత మొహమాటం మాటలు పలికిస్తూ, తన కథంతా చెప్పుకుంటూ అడుగు లేస్తోంది బుచ్చి.

సాప్తపదీనమైన సఖ్యం దాదాపు మూడు ఫర్లాంగులు నెరపి ఇటు బుచ్చి పక్కదారికి మళ్ళడమూ, అటు రెండే రెండడుగులు వెనకనించి ఒక సకిలింపుతోబాటు ఒక కొత్త పలకరింపు వినబడ్డమూ జరిగాయి.

"ఎక్కణ్ణించోయ్! ఇల్లాగకే?"

సీతాపతి ఉలిక్కిపడి వెనక్కితిరిగి చూశాడు.

"శంకరయ్య మాఁవాఁ కే"

"ఆఁ, ఆఁ, — చీకట్లో కనబట్టంలేదుగావున్ను! ఏమిటి, ఇల్లా బయల్దేరావుకే— అల్లుడాడు వెళ్ళాడా కే"

"లేదు—"

"ఏం వెళ్తాడుకే... వెళ్ళక్కర్లేదు గూడాగావున్ను."

"అంకే?"

"ఉద్యోగం సద్యోగం యిలాంటి బాదర బందీల్లేవ్వుగా."

సీతాపతి నవ్వుకున్నాడు. ఏమిటో – తన అల్లుడు తనింట్లో తింటూ పదిరోజులపాటు ఆనందంగాఉన్నా ఆ ముచ్చట్లూ లోపానికే కావాలి!

"ప్చ్ ! – వాళ్ళకెందుకు మామా, ఉద్యోగాలూ వూడిగాలూ."

"అంతేలే ! – అయినా ఇప్పుడేం తెలుస్తుంది? ఆ ఉన్న పిప్పీ పిసరూ నలుగురన్నదమ్ములూ పంచుకోవాలి – కూతురు నలుగురు పిల్లల్ని కనాలి – అప్పుడు గదా ఎంతోస్తోందీ అన్నప్రశ్న ! అందరూ నీలాగా దీపంవుండగానే ఇల్లు చక్కబెట్టుకో గలరా ?"

సీతాపతి మాట్లాడలేదు.

"చెప్పవేం ? – పదెకరాల పొలమూ ఊళ్ళో మేడా, ఒక్కడివీ – నువ్వే యుద్ధంలోకిపోయి అంతో యింతో తెచ్చుకున్నావు. అందరికీ అలా చేతవుతుందా అని –"

సీతాపతి నవ్వుకున్నాడు. అయితేనేం – జవాబు చెప్పవలసిన అవసరం కాకతాళీయంగా తప్పింది... సరిగ్గా ఈ మాట అనేవేళకి శంకరయ్యయింటి ముందుకొచ్చారు ఇద్దరూ.

"మరి నే ఒస్తాను మావాఁ." అన్నాడు సీతాపతి.

శంకరయ్య నవ్వాడు. "ఏదైనా అర్జంటు వ్యవహారవాఁ ? – రావోయ్, కాసేపు కూచుని వెడుదువుగాని."

ఇహ తప్పేది లేదు.

శంకరయ్య షష్టిపూర్తి. ఇంటినిండా బలగం.

కానీ అంత కుంకం బొట్టుతో ఇల్లాలూ, పేడకళాపీ జల్లి ఇరవైనాలుగ్గంటలూ శుభ్రంగా వుంచే వాకిలీ, ఓ పక్క మల్లెపందిరి వోపక్క తులసికోటా ఇవన్నీ ఆ యింట్లో ఆకర్షణలు.

అక్కడికెళ్తేమళ్ళీ యిక్కడికి తొందరగా రాబుద్దెయ్యదు ఒక్క సీతాపతికే గాదు. ఎవరికైనాసరే.

సీతాపతి కిది చిన్నప్పట్నుంచీ అనుభవమే.

అంతేగాదు

పన్నెండేళ్ళు మిలిట్రీలో వుండి తిరిగొచ్చిననాడు—

ఊరంతా మారిపోయి,

మహాకవి కథలో లాగ "పోయి"

కొత్త సంస్కృతులూ, కొత్త చొక్కాలూ తొడుక్కుని.

"ఇది మన వూరు కాదనిపిస్తే.

ఈ వేపు శంకరయ్య యిల్లూ, ఈ తులసికోటా, మల్లెపందిరీ, ఈ వృద్ధదంపతులూ నిలబడి.

'ఇది మీ వూరే నాయనా.' అని చెప్పగలిగింది.

ఆ పాత ఘుమ ఘుమల్తో, ఆ ప్రశాంతతతోనే.

అయితే ఈ ప్రశాంతమైన ఇంట్లో,

గేటు దాటీ దాటగానే, లోపలికి వెళ్ళీ వెళ్ళగానే శంకరయ్య గొంతు మార్చి—

"ఏమిట్రా మామా, దీని వెనక పడ్డావూ? ఏమిటి కథ?" అన్నాడు.

తను లోపలి కడుగు వెయ్యలేదు.

సీతాపతిని వెయ్యనివ్వలేదు.

మెదడులో మేకుకొట్టినట్టయింది సీతాపతికి బుచ్చినిగురించి అడుగుతున్నాడని అర్థమై.

కాటికింద పాలు తాగిన సీతాపతి నిలబడిపోయాడు,

వొంట్లో విద్యుత్తు పృథక్కరించినట్టూ, పాషాణం మింగినట్టూ వుంది. వమనం కాదేమని బాధగావుంది.

అదేం మాటది?

ఆ మాట మరోడెవడైనా అన్నా,

మరోనాడు ఈ శంకరయ్య మావేఁ అన్నా,

వేరేవిధంగా జరగవలసిన కథ -

మధ్యాన్నం నించీ మస్తిష్కాన్ని మథిస్తున్న మంతనం కాబోలు - మౌనముద్రే వేయించింది.

'ఛి ఛీ్ఛ లేదు మావాఁ -' అననూ అన్నాడు.

దానికి శంకరయ్య "ఏడికావులే" అన్నట్టు పెద్ద నవ్వొ నవ్వేశాడు.

అంతేగాదు

ఆ సాయంత్రం శీతాతపంలో

శంకరయ్య యిచ్చిన గ్లాసెడు మంచితీర్థంలో -

సతీసమేతంగా చేసిన హితబోధలో—

ఏముందోగాని - ఇవతల ఒడేసరికి - ఒడ్డున బడ్డ చేపలా కొట్టుకునే ఈ చేపపోయి ఏ మత్స్యగంధి బుట్టలో పడుతుందోనని భయంవేసింది.

అరవై ఏళ్ళొళ్ళినా శంకరయ్య మామకి బుచ్చిని చూడగానే హుషారు కలిగి కలగవలసిన ఆలోచనా కలిగింది. తను అలా ఎందు కాలోచించలేదో?

అదొక ప్రశ్న! ఏమిటా ప్రశ్న? పడుచుదనం పరవళ్ళు తొక్కుతున్న తన యింద్రియాలు వెయ్యలేని ప్రశ్న! జవాబు లేని ప్రశ్న!... శంకరయ్యమావాఁ తనని సవాల్ చేసేది?

చేసినా చేస్తాడు. శంకరయ్యకాపు అఖరు కొడుక్కి నాలుగళ్ళు వెళ్ళలేదుట. పదిసార్లు తాత అయిపోయిన శంకరయ్య మామళ్ళీ తండ్రి అవుతాడేమోనని అనుమానం—ట—యిప్పుడు!

"ని కెందుకోయ్! భగవద్గీతలూ, బ్రహ్మసూత్రాలునూ? చిత్తం శివుడిమీదా భక్తి చెప్పులమీదా అన్నట్టూ!" అని పుస్తకం కాస్త లాక్కున్నాడుకూడానూ.

పెళాసి బుచ్చీ! ఎంత పని చేయించేవే! కనపడకుండా, యెరక్కుండాను. మో పెత్తి నెత్తిన పెట్టడానికి మించి దాంతో ఏ అనుబంధమూ లేనేలేదని ఎవరితో వేసుకోడం ఒట్టు?

ఒట్టు? ఒట్టులేదు—అంతా ఒట్టిది! నాటినించీ నేటి వరకూ, నానుకుపోయినమాట, వరాల శీటు!

రెండేళ్ళ పాపని "సవిత్తల్లి" ఏం చేస్తుందోననీ.

ఏం చెయ్యదో అనీ—

"ఎలా చూస్తుందో; ఎలా చూడదో అనీ అప్పుడూ;

ఫిలిమ్ట్రీలో చేరనే చేరాంకదా యిప్పు డెందుకులే అని తరవాతా.

చెట్టంత కూతురు నట్టింట్లో తిరుగుతూ వుంటే దానికి సంబంధం చూడాలిగాని తనకా అని అన్నీ అయినా కా—

ఆపేస్తూ వొచ్చాడేగాని... అవునా? అంతేనా?

"తాతా, పెళ్ళాడతావా?"

"నా కెవరిస్తారోయ్ పిల్లనీ?"

అబ్బబ్బ ఏమిటీ గొడవ?

కూతురూ అల్లుడూ డాబామీద నీ రెండ నీడలో ఒకర్నొకరు అనుకొని ఏదో చేశారనీ,

శంకరయ్య మావఁ బుచ్చి వెనక పడ్డావా అని అడిగాడనీ స్ఫురించి నప్పుడల్లా కోపం రావడం, కోపం రాగానే సర్దుకోడం, ఏమిటి ఇదంతా ? హుఁ||

పంచమి చంద్రుడు కుంగాడు.

సీతాపతి వీధి చివర్నించే అనుకోకుండా మేడ గదివేపు ఓ చూపు విసిరేశాడు.

పెద్ద లాంతరు వెలుతురు లేదక్కడ.

చిమ్మ చీకటీ లేదు.

కోడిగుడ్డు లాంపు వెలిగిం దప్పుడే.

ఎంత ఒద్దనుకున్నా దా నర్థం యిదీ అని మెదడులో వో కెరటం.

సీతాపతి సరదాగా కసురుకుని బెదురుగా నవ్వుకున్నాడు.

ఆవలిస్తూ తలుపు తీసిన అక్కగార్ని చూస్తే నవ్వొచ్చింది; ఆవిడ ఆవలింతకి చిటికలు వేశాడు నవ్వుకుంటూనూ.

“ఎక్కడ కూర్చున్నా వింత వరకూనూ ? వెంకడు ఊరంతా తిరిగొచ్చి బాబుగా రెక్కడా కనబళ్ళేదంటూ చక్కా ఒచ్చాడు.”

సీతాపతి అన్నం తింటూ పేరుకుపోయిన నెయ్యి చేతికంటు కుందని కంచం అంచుకి రాస్తున్నాడు.

“అన్నం తిని వెళ్ళక పోయినావా ? నీ అల్లుడు అరగంట

పాటు అతి మర్యాదగా విసుక్కుని, బలవంతం చేయించుకుని, నాలుగు ముద్దలు తిని వెళ్ళాడు మేడమీదికి.'

సీతాపతి మాట్లాడకుండా అన్నం తినేశాడు. కంచంలో చెయ్యి కడిగేసుకొని, ఉత్తరీయంతో జిడ్డు తుడిచేసికొని యింకా అక్కడే కూచున్నాడు.

'అయితే అప్పా! గవరయ్య మామకూతుర్ని నువ్వు చూశావటే ఈ మధ్య ?' అన్నాడు.

పార్వతమ్మ వులిక్కి పడ్డది. అప్పా అన్న పిలుపే విచిత్రం! అది సాధారణంగా సీతాపతి నోటంట రాదు. అమ్మా అనే ఎప్పుడు పిల్చినా!

'గవరయ్య మామంటే పాలెం మావేనా ?'

'ఆఁ!'

'చూడకేం ? మనింటికి పెళ్ళి కొచ్చింది! అందరి పెళ్ళిళ్ళూ చూసిందిగాని దాని పెళ్ళే ఉండిపోయింది. ఇంకేం పెళ్ళిళ్ళ! పాతికేళ్ళు వెళ్ళినట్టున్నాయి! దానికేమైంది యిప్పుడూ'

'దాని పేరేమన్నావ్ ?'

'గంగ... కులాసాగా వుందిటా ?'

'బావుంటుందా ?'

'బావుండక పోడానికి దానికేం, కన్నొంకరా, కాలొంకరా? కట్నాల బాధ పళ్ళేకగాని, గవరయమామ దానికి సంబంధమే చూడలేక పోయాడా ?'

'నువ్వు సరిగ్గా చూశావా ?—బుద్ధిమంతు రాలేనా ?'

'అవుననుకో, అదంతా ఎందుకిప్పుడూ.'

'ఎందుకేమిటి, పెళ్ళికి' సీతాపతి పొడిగా నవ్వాడు.

'ఎవరేమిటి, దాన్ని చేసుకునేది?'

'ఎవరో చేసుకుంటే మన మెందుకూ మాట్లాడుకోడం? నేనే చేసుకుందామని'

పార్వతమ్మ నిర్ఘాంతపోయింది. 'ఇదేంటన్నా యిదీ?'

'సీతాపతి లేచాడు. 'ఏం?-నాకేం వయసు మళ్ళిపోయిందనీ? చీకా? చింతా? రవణని అత్తారింటికి పంపవలసిందేగా, రేపో నేడో! ఆ తరవా తేం చెయ్యడం? బిక్కూ బిక్కూమంటూ యీ యింట్లో మనిద్దరం యెంతకాలంవని ఉంటాం?'

• • •

చకచకా నడుచుకుంటూ సీతాపతి హాల్లో కొచ్చేశాడు - లాంతరు పెద్దదిచేసి వక్కపొడి సీసాకోసం నాలుగువేపులా దృష్టి సారించాడు.

'అదిగో, అ నిలువుటద్దందగ్గిర బల్లమీదుంది.'

చకచకా నిలువుటద్దం దగ్గిర కెళ్ళాడు సీతాపతి. వక్కపొడి తీసుకునేముందు అద్దం ఆతని దృష్టి నాకర్షించింది. ఆత నందులోకి చూశాడు.

అందులో ఒక యిరవైయొనిమిదేళ్ళ మనిషి దేహం పన్నెండు ఏళ్ళపాటు దేశానికల్లా వుత్తమమైన భోజనం చేసిన దేహం. బలంగా

గుండ్రంగా, ఆకర్షణీయంగా ఉన్న దేహం కనిపించింది. అనుమానించి మొహంవేపు చూశాడు సీతాపతి.

ఆ మొహంలో సున్నటి నిశ్చయం, మెత్తటి హాసం కనబడింది.

"ఈ వెధవ అద్దం ఇందాక ఎంత అబద్ధ మాడింది!"

